తక్కెడ.. బాట్లు లాక్కుంటున్నారు..

- తై బజార్ చీటి పేరిట జులుం
- కూరగాయల వ్యాపారుల ఆవేదన
- అడ్డగోలుగా వసూళ్లు



కోరుట్ల: పై ఫొటోలో కనిపిస్తున్న పేరు..రాధ. సుమారు ఐదేళ్లుగా కోరుట్లలో బురుజు మార్కెట్ వద్ద కూరగాయలు అమ్ముతోంది. ఈ ఏడాది మున్సిపల్ నుంచి తైబజార్ వేలంపాట పాడిన వారు అడ్డగోలుగా డబ్బులు అడుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తోంది. కొందరికి రోజుకు రూ.15 మరికొందరికి రూ. 20 వసూలు చేస్తున్నారని, వసూళ్లలో తేడా ఏంటని అడిగితే తక్కెడ..బాట్లు గుంజుకుంటున్నారని వాపోయింది. ఇలాగే చాలామంది తక్కెడ బాట్లు గుంజుకుని ఇబ్బంది పెడుతున్నారని, వ్యాపారులు, రైతులను పరేషాన్ చేసే ఏం వస్తదని ఆవేదన వ్యక్తం చేస్తోంది.



కోరుట్లలో బురుజు కూరగాయాల మార్కెట్

ఇది..ఒక్క కూరగాయాల వ్యాపారి రాధ ఆవేదన కాదు.. కోరుట్లలోని వివిధ మార్కెట్లలో చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చి కూరగాయలు, పండ్లు, పట్టణంలోని తిరుగుతూ సరుకుల అమ్మకాలు చేసే చిన్నచిన్న రైతులు, వ్యాపారుల ఆక్రోశం

ఏమిటీ తై బజార్..

కోరుట్ల పట్టణంలో వివిధ మార్కెట్లలో కూరగాయలు, ఇతరత్రా సరుకులు అమ్ముకునే వారి నుంచి ప్రతీ రోజు కొంత రుసుము వసూలు చేసుకునేందుకు మున్సిపల్ నుంచి తైబజార్ వేలం నిర్వహిస్తారు. ఈ వేలం పాట ఈ ఏడాది(2024–25) రూ. 12 లక్షలకు వేలం పాడారు. మున్సిపాల్టీకి ఆదాయం సమకూర్చే వాటిలో ఇదో ఆదాయ వనరుగా భావిస్తున్నప్పటికీ.. రోజుకు రూ.500 నుంచి వెయ్యి రూపాయల వరకు సరుకులు అమ్ముకునే చిరు వ్యాపారులు, రైతుల నుంచి తైబజార్ రుసుము భారంగా మారింది. ఇలా తైబజార్ రుసుము చెల్లించే రైతులు వ్యాపారులు ప్రతీ రోజు సుమారు 350–500 మంది వరకు ఉంటారు.

వీరినుంచి కాంట్రాక్టర్ అడ్డగోలుగా వసూలు చేస్తున్నాడనే ఆరోపణలున్నాయి. ప్రతీ రోజు రూ. 15 నుంచి రూ. 50 వరకు వసూలు చేస్తారు. కొందరి వద్ద బలవంతంగా రూ.30–50 వరకు వసూలు చేస్తున్నారని అమ్మకందార్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అడిగితే తక్కెడ బాట్లు లాక్కుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

పాలకవర్గాల నిర్లక్ష్యం..

ప్రతీ రోజు రూ. 500–రూ. వెయ్యి వరకు అమ్మకాలు సాగించే చిన్న వ్యాపారులు, రైతుల వద్ద నుంచి ఆదాయం పొందాలన్న ఆలోచన చేయడం పాలకవర్గాల వైఖరికి అద్దం పడుతోంది. కోరుట్ల మున్సిపాల్టీగా మారి సుమారు 25 ఏళ్లు గడుస్తున్నా.. తైబజార్ వేలం పేరిట అరకొర ఆదాయం కోసం పాలకవర్గాలు అర్రులు చాచడం విడ్డూరంగా ఉంది. జగిత్యాలలో మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి తై బజార్ వేలంపాట రద్దు చేయించారు. సుమారు ఇరవై ఏళ్లుగా జగిత్యాలలో తైబజార్ వేలం లేదు. కానీ జిల్లాలోని కీలక మున్సిపాల్టీలైన కోరుట్లలో రూ.12 లక్షలు, మెట్‌పల్లిలో రూ.11 లక్షలు వేలం పాడారు. తైబజార్ పేరిట కాంట్రాక్టర్లు అడ్డగోలుగా డబ్బులు వసూలు చేస్తూ, సౌకర్యాలు మాత్రం కల్పించడం లేదు. దీనిపై పాలకవర్గాలు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా తైబజార్ వేలంపాటను పాలకవర్గాలు, అధికారులు రద్దు చేయాలని రైతులు, చిన్నచిన్న వ్యాపారులు డిమాండ్ చేస్తున్నారు.

మా డబ్బులతోనే నిండుతుందా..?



మున్సిపాల్టీ వాళ్లకు మేమిచ్చే డబ్బుతోనే ఆదాయం వస్తుందా..? ఒక్కసారి తై బజార్ వేలం వేసి వదిలేస్తారు. మాకు ఏలాంటి సౌకర్యాలు కల్పించరు. కానీ ప్రతీ రోజు కాంట్రాక్టర్ ఇష్టం వచ్చినట్లు డబ్బులు వసూలు చేస్తారు. ఇదేంటని అడిగితే తక్కెడ బాట్లు గుంజుకుంటున్నారు. ఇదేమి తీరు..?

– హన్మక్క, కూరగాయల వ్యాపారి, బురుజ మార్కెట్, కోరుట్ల

చర్యలు తీసుకుంటాం



తైబజార్ చీటీల వసూళ్లలో అవకతవకలు జరుగుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఇప్పటికే కాంట్రాక్టర్‌ను హెచ్చరించాం. మళ్లీ కాంట్రాక్టర్‌ను పిలిచి మాట్లాడి ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా వ్యాపారులు, రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– మారుతి ప్రసాద్, మున్సిపల్ కమిషనర్, కోరుట్ల



కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట శివారులో వై జంక్షన్ వద్ద సూచిక బోర్డులు లేకపోవడంతో వాహనాలపై వెళ్లేవారు అయోమయానికి గురవుతున్నారు. కథలాపూర్ నుంచి వాహనాలపై భూషణరావుపేట గ్రామానికి వచ్చేవారు సూచిక బోర్డులు లేకపోవడంతో పెగ్గెర్ల గ్రామానికి చేరుకుంటున్నారు. చింతకుంట నుంచి వచ్చే వారు కథలాపూర్‌కు బదులు పెగ్గెర్ల గ్రామానికి వెళ్తున్నారు. రోడ్ల భవనాలశాఖ అధికారులు చొరవ చూపి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి:
మనోహర్, ఆర్టీసీ డిపోమేనేజర్, కోరుట్ల : 9959225928

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

క్లుప్తంగా

బ్రిడ్జి నిర్మాణ పనులు పరిశీలన



నిర్మాణపనులు పరిశీలిస్తున్న జీవన్ రెడ్డి

జగిత్యాలరూరల్: మండలంలోని కండ్లపల్లి పెద్ద చెరువు వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులను ఆదివారం మాజీ మంత్రి జీవన్ రెడ్డి పరిశీలించారు. వర్షాకాలం లోపు పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జున్ను రాజేందర్, మాజీ సర్పంచ్ రాధాకిషన్ రావు, నాయకులు ముద్దం రాజిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

'ఎర్లీబర్డ్' వినియోగించుకోవాలి

జగిత్యాల: ఎర్లీబర్డ్ పథకాన్ని వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ స్పందన అన్నారు. 2025–26కు గాను పట్టణంలో 27,662 అసెస్మెంట్లు ఉండగా అందులో 2021 అసెస్మెంట్లకు సంబంధించి ఎర్లీబర్డ్ పథకాన్ని వినియోగించుకున్నారని తెలిపారు. రూ.13 కోట్ల డిమాండ్ ఉందన్నారు. ఇంకా 16 రోజుల సమయం ఉందని, పట్టణ పౌరులు వినియోగించుకోవాలని కోరారు.

కేంద్రం బీసీ రిజర్వేషన్లను ఆమోదించాలి



మాట్లాడుతున్న మాజీ చైర్‌పర్సన్ వసంత

జగిత్యాలజోన్: కేంద్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను ఆమోదించాలని జెడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన మున్నూరు కాపుల ఆత్మీయ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేలో మున్నూరు కాపులను తక్కువ చేసి చూపిస్తున్నారని ఆరోపించారు. మున్నూరు కాపుల సింహగర్జనను సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్లు దానిని విజయవంతం చేయాలని కోరారు.

రాజ్యాంగ పరిరక్షణకు కృషి



పాదయాత్రలో జువ్వాడి కృష్ణారావు

కోరుట్లటౌన్: రాజ్యాంగ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. పట్టణంలోని 20వ వార్డులో ఆదివారం జై బాపు జైభీమ్ జై సంవిధాన్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని అమలు పరచడంలో అంబేద్కర్ స్ఫూర్తికి పూర్తి విరుద్ధంగా ప్రవర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్, నాయకులు వెంకటస్వామి, చిట్యాల లక్ష్మీనారాయణ, మ్యాకల నర్సయ్య, ఏలేటి మహిపాల్‌రెడ్డి, ఏఆర్ అక్బర్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

రజతోత్సవ సభకు పింఛన్ విరాళం

మల్యాల: ఈ నెల 17న ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు మల్యాల మండలం ఓబులాపూర్ గ్రామానికి చెందిన ఆసరా పింఛన్‌దారుడు ఎండీ అమీర్ సాహెబ్ తన పింఛన్ డబ్బులు రూ. 2 వేలను చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు ఆదివారం అందజేశారు. రజతోత్సవ సభకు జన సమీకరణలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎల్కతుర్తి రజతోత్సవ సభకు గ్రామ గ్రామాన ప్రజలు దండుకట్టి తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

పటేల్ ఆశ్రమమే భగవంతుడి నిలయం

జగిత్యాలరూరల్: భగవంతుడి హృదయమే పటేల్ ఆశ్రమమని నాగ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ముస్కు పద్మావతి రాజేశ్వర్ రెడ్డి అన్నారు. ఆదివారం జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్, టీఆర్‌నగర్ గ్రామాల్లో ఏకనామ స్మరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ సేవయే మాధవ సేవ అని, కుల మత భేదాలు లేకుండా అందరిని సమదృష్టితో చూడాలన్నారు. కార్యక్రమంలో కార్యక్రమ నిర్వాహకులు మహిపాల్ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఉచిత రక్త పరీక్షలు

కోరుట్లటౌన్: పట్టణంలోని సి.ప్రభాకర్ స్మారక భవన్‌లో వృద్ధులకు ఉచిత రక్త పరీక్షలు ఆదివారం నిర్వహించారు. వృద్ధుల సంక్షేమ సంఘం, ప్రసాద్ డయాగ్నో సెంటర్ ఆధ్వర్యంలో 60 ఏళ్లు నిండిన వృద్ధులకు ఉచితంగా రక్త నమూనాల కేంద్రం ఏర్పాటు చేశారు. 72 మంది వృద్ధులు హాజరై, పరీక్షలు చేసుకున్నారు. కార్యక్రమంలో వృద్ధుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు చెన్న విశ్వనాథం, అధ్యక్షుడు రాచకొండ పెద్ద దేవయ్య, ఉపాధ్యక్షులు శికారి గంగాధర్, ల్యాబ్ టెక్నీషియన్ వనమాల ప్రసాద్, భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాడీ ఫ్రీజర్ వితరణ

మల్లాపూర్: వలస కుటుంబాలకు వీవీరావుపేట గల్ఫ్ సంఘం అండగా నిలుస్తుందని ఆ సంఘం అధ్యక్షుడు పెనుకుల అశోక్ అన్నారు. మండలంలోని వేంపల్లి–వెంకట్రావ్‌పేటలో గల్ఫ్ కార్మికులు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు,గల్ఫ్ కార్మికులు ఆదివారం సమావేశం నిర్వహించారు. గల్ఫ్ కార్మిక కుటుంబాలకు వీవీరావుపేట గల్ఫ్ సంఘం ద్వారా సేవ చేయడంతో పాటు కష్టకాలంలో అండగా నిలిచి భరోసా కల్పించనున్నట్లు తెలిపారు. అనంతరం రెండు గ్రామాల ప్రజల సౌకర్యార్థం బాడీ ఫ్రీజర్‌ను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బిట్ల నరేష్, కోడిమ్యాల రవి, మచ్చర్ల దశరెడ్డి, మీనుగు చంద్రశేఖర్, బైన ప్రశాంత్, వీవీరావుపేట గల్ఫ్ సంఘం నిర్వాహకులు నలిమెల ప్రసాద్, ఆరెల్లి మహేశ్, బాలసాని లక్ష్మీనారాయణగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పీజీ మెడిసిన్‌లో గోల్డ్ మెడల్

సారంగాపూర్: మండలంలోని కోనాపూర్ గ్రామానికి చెందిన డాక్టర్ గుగ్లోతు మానస గాంధీ మెడికల్ కళాశాలలో గైనకాలజీ, ఒబ్‌స్టెట్రిక్స్ విభాగంలో పీజీ పట్టా పొందారు. కోనాపూర్ గ్రామానికి గిరిజనులు భాస్కర్‌నాయక్ –అరుణ వ్యవసాయం చేస్తూ కూతురిని ఎంబీబీఎస్ చదివించారు. ఎంబీబీఎస్‌లోనూ మానస గోల్డ్‌మెడల్ సాధించారు. ఈ సందర్భంగా మానసను గ్రామస్తులు, నాయకులు పలువురు అభినందించి సన్మానించారు.

రాజీవ్ యువ వికాసం దరఖాస్తు గడువు పెంచాలి

కోరుట్లటౌన్: రాజీవ్ యువ వికాస్ పథకం దరఖాస్తు గడువు పొడగించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జి. తిరుపతి నాయక్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదివారం డిమాండ్ చేశారు. దరఖాస్తు చేసే క్రమంలో సైట్ ఇబ్బందులతో యువకులు సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దరఖాస్తు ఆఖరు తేదీ ఈనెల 14 కావడంతో యువత ఆందోళనకు గురవుతున్నారని, వెంటనే గడువు పెంచాలన్నారు. అర్హులైన యువకులకు పథకం పారదర్శకంగా అందించాలని కోరారు.

శ్రీపాదరావుకు నివాళి

మెట్‌పల్లి: పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం మాజీ స్పీకర్ దివంగత శ్రీపాదరావు వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, నాయకులు వాకిట సత్యంరెడ్డి, ఖుత్బుద్దీన్, అందె మారుతి, కూన రాకేశ్, వెంకటగిరి, జాఫర్, బైండ్ల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిడుతల రామాయణం

గొల్లపల్లి: మండలంలోని దమ్మన్నపేటలో ప్రదర్శించిన చిడుతల రామాయణ నాటిక ప్రదర్శన ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంది. గత నాలుగు రోజులుగా స్థానిక కళాకారులు గ్రామంలో నాటికను ప్రదర్శిస్తున్నారు. ప్రదర్శనలో భాగంగా నాటికలో ముఖ్య ఘట్టాలను ఎంతో చక్కగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా కళాకారులను రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ కందుకూరి కృష్ణారెడ్డి, నాయకులు పాదం తిరుపతి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయండి

జగిత్యాలటౌన్: మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్లను ఉపసంహరించుకునేలా ఒత్తిడి తెచ్చేందుకు మే 20న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని అంగన్‌వాడీ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర కార్యదర్శి విజయలక్ష్మి కోరారు. జిల్లా అధ్యక్షురాలు రజిత అధ్యక్షతన ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మోదీ సర్కార్ కార్మికవర్గాన్ని తుడిచి పెట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కన్వీనర్ పుప్పాల శ్రీకాంత్, సహాయ కార్యదర్శి జ్యోతి, జిల్లా కార్యదర్శి స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో హనుమాన్ భక్తుల రద్దీ



ధర్మపురిలోని ప్రధాన ఆలయంలో భక్తుల రద్దీ

ధర్మపురి: చిన్న హనుమాన్ జయంతి సందర్భంగా దీక్షలు చేపట్టిన స్వాములంతా కొండగట్టులో మాల విరమణలు చేసి, తల నీలాలు సమర్పించి స్వామివారికి ముడుపులు చెల్లించారు. ఆదివారం ఉదయం ధర్మపురికి చేరుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ముందుగా గోదావరిలో స్నానాలు ఆచరించి అనంతరం ధర్మపురిలోని శ్రీలక్ష్మీ నృసింహస్వాములను, ప్రసన్నాంజనేయ స్వాములను దర్శించుకున్నారు. దైవ దర్శనం కోసం వచ్చిన భక్తులకు దేవస్థానం వారు అన్ని వసతులు కల్పించారు.

భీమేశ్వరస్వామికి ఒడి బియ్యం



స్వామికి ఒడి బియ్యం సమర్పిస్తున్న మహిళలు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం పొరండ్లలో భీమేశ్వరస్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆదివారం భీమేశ్వరస్వామికి ఒడి బియ్యం సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. అలాగే, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి పోరండ్ల భీమేశ్వర స్వామిని హన్మాజీపేట పెద్దమ్మ తల్లిని దర్శించుకున్నారు.

వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

మెట్‌పల్లి: పట్టణంలోని కళానగర్ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వొడ్లాటి నారాయణ, ఉపాధ్యక్షుడిగా తిప్పర్తి వెంకటస్వామి, కోశాధికారిగా తంగళ్లపల్లి రాజేశ్వర్‌ను సభ్యులు ఎన్నుకున్నారు.

అంబేద్కర్ జయంతి వారోత్సవాలు



ర్యాలీగా తరలివస్తున్న బీజేపీ నాయకులు

జగిత్యాలటౌన్: అంబేద్కర్ జయంతి వారోత్సవాల్లో భాగంగా ఆదివారం జగిత్యాల పాత బస్టాండ్ నుంచి తహసీల్ చౌరస్తా వరకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీగా తరలివచ్చారు. అనంతరం తహసీల్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహాన్ని శుద్ధిచేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి, వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరిబాబు, అంబేద్కర్ వారోత్సవాల కమిటి జిల్లా కన్వీనర్ ఓరుగంటి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలి

మెట్‌పల్లి: భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ జయంతి వేడుకలను సోమవారం పట్టణంలోని ప్రతి వార్డులో ఘనంగా జరపాలని అంబేద్కర్ యువజన సంఘం పట్టణాధ్యక్షుడు కంబ శంకర్ కోరారు. జయంతి సందర్భంగా ప్రజలంతా ఘనంగా నివాళి అర్పించాలని విజ్ఞప్తి చేశారు.

అంబేద్కర్‌కు నివాళి

జగిత్యాలటౌన్: కలియుగ దైవం అంబేద్కర్ అని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి బండ శంకర్ అన్నారు. ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం తహసీల్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహాన్ని పాలతో శుద్ధి చేసి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ (డిక్కీ) జిల్లా అధ్యక్షుడు నల్ల శ్యాం, చిత్తారి ప్రభాకర్, కొడిపెల్లి సురేశ్, జవ్వాజి శంకర్, దాసరి లచ్చయ్య, బొల్లం రమేశ్, కన్నం అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతిని విజయవంతం చేయాలి

పెగడపల్లి: మండల కేంద్రంలో నేడు జరిగే అంబేద్కర్ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బత్తుల ప్రదీప్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద ఉదయం 10 గంటలకు వేడుకలు నిర్వహించనున్నట్లు యువకులు, మేధావులు, అన్ని వర్గాల ప్రజలు హాజరు కావాలని కోరారు.

కథలాపూర్: ఈనెల 14న ఊరూరా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ జయంతి ఉత్సవాలు నిర్వహించి విజయవంతం చేయాలని పూలే అంబేద్కర్ జ్ఞాన వేదిక వ్యవస్థాపకులు మారంపెల్లి రవీందర్ కోరారు. ఆదివారం కథలాపూర్‌లోమాట్లాడారు. అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజాసంఘాల నాయకులు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి కాశవత్తుల లక్ష్మిరాజం, నాయకులు కలిగోట రాజం, శనిగారపు గణేశ్, రాజేశ్, అర్జున్, వినోద్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

రాయికల్: మండలంలోని ఇటిక్యాలలో జగిత్యాలకు చెందిన శ్రీ వేంకటేశ్వర ఆర్థో జనరల్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ విజయ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం గ్రామంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వందమందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కొమ్ముల ఆదిరెడ్డి, కాటిపెల్లి గంగారెడ్డి, నల్ల గంగారెడ్డి, గడ్డం సంజీవ్‌రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

రాయికల్: మండలంలోని ఇటిక్యాల జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాలలో 1999 –2000 సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులంతా కలిసి ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుతున్న సమయంలో చేసిన అల్లర్లు గుర్తు చేసుకుంటూ సరదాగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు



2012-13 బ్యాచ్ విద్యార్థులు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 2012–13 బ్యాచ్ పూర్వ విద్యార్థులు కొండ స్వామి గార్డెన్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను సత్కరించారు.

ధర్మపురి: ధర్మపురిలోని శ్రీవాణి ఉన్నత పాఠశాలలో 2004–2005 విద్యా సంవత్సరంలో 10వ, తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. తమ చిననాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర ఉన్నత పాఠశాల లో 1996–1997 లో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం పద్మనాయక కల్యాణమంటపంలో నిర్వహించుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులను సన్మానించారు.

జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని చేతన హైస్కూల్‌లో 2003–2004 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థిని, విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమకు చదువు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బైక్ మెకానిక్ వైద్యానికి ఆర్థికసాయం



ధర్మపురి: అనారోగ్యం బారిన పడి కోమాలోకి వెళ్లిన బైక్ మెకానిక్ కుటుంబానికి యూనియన్ సభ్యులు అండగా నిలిచారు. బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ గ్రామానికి చెందిన బొమ్మిడి తిరుపతి బైక్ మెకానిక్‌గా పని చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. అతడికి భార్య, ముగ్గురు పిల్లలు. తిరుపతి ఇటీవల పనులు చేస్తుండగా ఒక్కసారి కింద పడి కోమాలోకి వెళ్లాడు. అతన్ని ఆస్పత్రిలో చూపించగా బ్రెయిన్‌లో రక్తం గడ్డ కట్టిందని వైద్యులు తెలిపారు. దీంతో బైక్ మెకానిక్ యూనియన్ సభ్యులంతా తిరుపతి వైద్యం కోసం 32 మంది యూనియన్ సభ్యులు తలా కొంత పోగు చేసి 1.14 లక్షల రూ.ల ఆర్థిక సాయాన్ని అందజేశారు. సి తమ ఉదారతను చాటుకున్నారు. యూనియన్‌లో ఎవరికి ఏ ఆపద వచ్చిన ఆదుకుంటామని యూనియన్ నాయకుడు సాబీర్ తెలిపాడు.

ఘనంగా మల్లన్న జాతర



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

కోరుట్ల రూరల్: కోరుట్ల మున్సిపల్ పరిధిలోని యెఖీన్‌పూర్ శివారులోని మల్లన్న స్వామి ఆలయంలో జాతర ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు,అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అన్న దానం చేశారు. సాయంత్రం బోనాలతో ఊరేగింపుగా వెళ్లి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు మల్లన్న స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మల్లికార్జున స్వామికి పూజలు

కోరుట్ల: పట్టణంలోని ఎఖీన్‌పూర్ మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు ఉత్సవాలకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కొంతం రాజం, తిరుమల గంగాధర్, ఏలేటి మహిపాల్‌రెడ్డి, లక్ష్మన్, మురళి, పాల్గొన్నారు.